## క్లుప్తంగా

### మర్యాదపూర్వక కలయిక


సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణ

విశాఖ విద్య: విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.కృష్ణ(ఆల్ఫా కృష్ణ) శుక్రవారం వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. సభ్యులందరినీ కలుపుకొని మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని సుబ్బారెడ్డి ఆశీర్వదించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.కృష్ణ తెలిపారు.

### వెస్ట్ క్రైం సీఐ బాధ్యతల స్వీకరణ


విధుల్లో క్రైం సీఐ శ్రీనివాసరావు

మర్రిపాలెం: వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐగా ఎస్.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన సంతకం పెట్టి విధుల్లో చేరారు. గతంలో త్రీటౌన్ క్రైం ఎస్ఐగా, విజయనగరం, పార్వతీపురం స్పెషల్ బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేరాల నియంత్రణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.

### నూతన కమిటీ సభ్యులకు అభినందన


సాయినగర్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు సాయినగర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులకు బెహరా భాస్కరరావు అభినందనలు తెలిపారు. ఇటీవల సాయినగర్ వాసుల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు శుక్రవారం బెహరా భాస్కరరావును ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామనాయుడు, కార్యదర్శి అమర్నాథ్, గౌరవ అధ్యక్షుడు దవళ మోహన్ , కోశాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు ఆలోచించాలి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో శుక్రవారం ఎమ్మెల్యే గణబాబు 'బాబు షూరిటీ– భవిష్యత్' గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఆలోచించి సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి సోమేష్, కాకి పాలిరెడ్డి,శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రేపు అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మహాజనసభ

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 9.45గంటలకు సభ ప్రారంభమవుతుందని చెప్పారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల షేర్‌ధనంపై చెల్లించే వడ్డీ , త్రిప్ట డిపాజిట్లకు వడ్డీ చెల్లించే విషయాలపై ఆమోదం తెలిపే అంశాలతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరు కావాలని స్వామి కోరారు.

# ఆనందమని 'పింఛన్'

ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచారు. అవ్వా తాతలు, వితంతువులకు రూ. 3 వేలు పింఛన్‌ను పండగ వాతావరణంలో పంపిణీ చేస్తున్నారు. కన్నవారే పట్టించుకోని ఈ రోజుల్లో ఇంటికి పెద్ద కొడుకులా జగన్ ఆదుకుంటున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.3 వేల అందజేత
- పెరిగిన పింఛన్‌తో లబ్ధిదారుల్లో ఆనందం
- కరాసలో పింఛన్ల పంపిణీ ప్రారంభించిన డిప్యూటీ మేయర్ శ్రీధర్


టీడీపీ కార్యకర్త తల్లికి పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

విశాఖ విద్య: సామాజిక పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగుతోంది. వార్డుల పరిధిలోని కాలనీల్లో పండగ వాతావరణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులు ఒక్కొక్కరికి పింఛన్ డబ్బులు రూ.3 వేలు అందజేస్తున్నారు. జీవీఎంసీ 52వ వార్డు కరాసలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం లబ్ధిదారులకు ఫించన్లు అందజేశారు. కాలనీలోని పలువురు ఇళ్లకు వెళ్లి ఈ నెల నుంచి పెరిగిన పింఛను రూ.3 వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు పింఛన్ నెలకు రూ.3 వేలకు పెంచారని గుర్తు చేశారు. అవ్వా–తాతల కళ్లలో ఆనందం చూడాలనే ఉన్నత సంకల్పంతో సామాజిక పింఛన్లు ప్రతీ ఏటా పెంచుతూ వచ్చారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే ముందుగా ప్రతీ నెలా ఒకటో తారీఖునే ఇంటి తలుపుతట్టి సామాజిక పింఛన్లు పంపిణీ చేపడుతున్న గొప్ప మనసున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.ఆయన రుణం తీర్చేకునే సమయం ఆసన్న మైందని, ఇందుకు ప్రతీ ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు వెదుళ్ల శ్రీను, సీవో సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


90వ వార్డులో పింఛన్ అందజేస్తున్న నమ్మి శ్రీను

- 90వ వార్డులో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేశారు. రూ. 3వేలు పింఛను డబ్బులు అందుకున్న లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది.

**92వ వార్డులో..**

గోపాలపట్నం: పేదింట పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్‌లో శుక్రవారం పెరిగిన పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. టీడీపీ హయాంలో పింఛను అందుకోవాలంటే ఎంతో కష్టపడే వారమని.. ఇపుడు వలంటీర్లు తమ వద్దకు వచ్చి ప్రేమతో పింఛను అందిస్తున్నారని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.3వేలు అందిస్తున్నారన్నారు. 92వ వార్డులో 1804 మంది రూ. 3000 పింఛన్ అందుకుంటున్నారన్నారు. కొత్తగా మరో 37మందికి పింఛన్ మంజూరైందని తెలిపారు. 91వ వార్డులో 1255 మంది పింఛను దారులుండగా కొత్తగా 28 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పింఛను పంపిణీ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు గేదెల మురళీ కృష్ణ, నీలాపు శ్రీనివాసరెడ్డి, సురేష్ గౌడ్డు నాగరాజు, అదినారాయణ, ఆర్పీ సత్యకళ తదితరులు పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

**చురుగ్గా పింఛన్ల పంపిణీ**

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం,మతం,పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని.. అందుకు నిదర్శనమే తన వార్డులో టీడీపీ కార్యకర్త తల్లికి పింఛన్ అందివ్వడమని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ అన్నారు. వార్డు పరిధిలోని ఇందిరాకాలనీ,బర్మాకాలనీ,అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా ఇందిరా కాలనీ వద్ద టీడీపీ కార్యకర్త ఇంటికి కార్పొరేటర్ సురేష్ వెళ్లి ఆమెకు రూ. 3 వేల పింఛన్ అందించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్,నాయకులు చేరకాపు బుజ్జి, గుంటా సుందరరావు తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనగర్‌లో పింఛన్ అందిస్తున్న బెహరా భాస్కరరావు


మంచంపై ఉన్న రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మి, నాయకులు

- 58వ వార్డు పరిధి పిలకవానిపాలెం,శ్రీనివాసనగర్,గొందేశివానిపాలెం తదితర ప్రాంతాల్లో వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి,ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి పింఛన్లు అందించారు.


లక్ష్మీనగర్ ఎఫ్–బ్లాక్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సత్యవతి

- యారాడ గ్రామంలో అప్పచ్చమ్మ అనే మహిళ పక్షవాతంతో మంచంపై ఉంది. ఆమెకు ఆ ప్రాంత వార్డు వలంటీర్ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటప్పారావు,బాబి తదితరులు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు.

### సంతోషంగా ఉంది



పింఛను డబ్బులు రూ.3 వేలు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మా ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి జగన్ బాబు పింఛను డబ్బులు వలంటీర్లతో ఇంటికి పంపిస్తున్నాడు. మాలాంటి ముసలోళ్లకు ఇంతకన్నా ఏం కావాలి. జగన్‌బాబు చల్లగా ఉండాలి.

–ఎస్.రత్నం, న్యూ కరాస, 52వ వార్డు

### బతుకుకు భరోసా



నాకు నలుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. అందరికీ వివాహాలు చేసేశాను. ఎవరిపై ఆధారపడకుండా పింఛను డబ్బులు ధైర్యాన్ని ఇస్తున్నాయి. పోయిన నెల వరకు రూ.2,750లు వచ్చేవి. ఇప్పుడు రూ.3 వేలు ఇచ్చారు. నెలకు సరిపడా మందులు కొనుక్కుంటాను. మిగిలిన డబ్బులు నా అవసరాలకు ఉపయోగించుకుంటాను.

– బాడిత సూరిబాబు, సాయిదుర్గా కాలనీ,

### జగన్ బాబు మేలు మర్చిపోలేం



నా భర్త చనిపోయారు. నేను పనులకు వెళ్తేనే కుటుంబం గడిచేది. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆరోగ్య శ్రీ వల్ల బతికి బయటపడ్డాను. పింఛను డబ్బులు ఇంటి అవసరాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జగన్ బాబుమేలు ఎప్పటికీ మరిచిపోలేం.

–యాదవరెడ్డి రమ, కరాస, 52వ వార్డు

## రోడ్డు పనులు ప్రారంభించాలి


అధికారులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులోని పద్మనాభనగర్ రహదారిని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శుక్రవారం జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. 11 నెలల కిందట నిధులు మంజూరైనా పనులు చేపట్టక పోవడంతో విషయాన్ని ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఎస్ఈ రామ్మోహనరావు, ఈఈ రమణ మూర్తి, ఏఈ వెంకటలక్ష్మితో కలిసి పరిశీలించారు. రహదారి, కాల్వలనిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అలాగే నిర్మాణంలో ఉన్న కాపు కల్యాణ మండపం పనులు కూడా వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు కంపర సత్తిబాబు, సాలాపు మారయ్య, నీలాపు శ్రీనివాస రెడ్డి, దాసరి శ్రీను, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో అవసరం


విద్యార్థినులకు సర్టిఫికెట్లు ఇస్తున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: అధికార వికేంద్రీకరణతో పాటు ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో అవసరం అని రాజనీతి శాస్త్ర సీనియర్ అధ్యాపకురాలు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పంచాయతీరాజ్ వ్యవస్థ – తీరు తెన్నులు' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ వ్యవస్థపై మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులకు ఆమె సర్టిఫికెట్లు అందించారు.కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సరైన సమాచారంతో అభివృద్ధి

- పరిశ్రమల వార్షిక సర్వేపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీ ప్రసాద్‌బాబు

అక్కిరెడ్డిపాలెం: సరైన సమాచారంతో సరైన అభివృద్ధి నినాదంతో పరిశ్రమలకు సంబంధించిన వార్షిక సర్వే ప్రగతి పథంలో నడుస్తోందని విశాఖపట్నం ఉప జాతీయ నమూనా సర్వే కార్యాలయం ఏడీ బి.ప్రసాద్ బాబు అన్నారు. ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో జాతీయ నమూనా సర్వే (క్షేత్ర కార్యకలాపాల విభాగం) పరిశ్రమల వార్షిక సర్వేపై పారిశ్రామిక వేత్తలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో పారిశ్రామిక గణాంకాలను, ప్రగతిని అంచనా వేసేందుకు వార్షిక సర్వే ద్వారా సేకరించిన సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యాలయం మరో ఏడీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలపై వార్షిక సర్వే సమాచారాన్ని ఆన్ లైన్‌లో మాత్రమే పొందుపర్చాలన్నారు. ఏఎస్ఐ రిటర్న్ దాఖలు పోర్టల్‌ను డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి అనార్ బాబు, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, జాతీయ నమూనా సర్వే సీనియర్ స్టేటిస్టికల్ అధికారులు కేవీఏవీ స్వామి, వి.రత్న కుమార్, పి.రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు.

## గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన

- వేతన బకాయిల చెల్లించాలని డిమాండ్


గంగవరం పోర్టు లోపల బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు లోపల రైల్వే ట్రాక్ గేటుతో పాటు ఔట్ గేటు వద్ద వీరంతా బైఠాయించారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో యాజమాన్య ప్రతినిధులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, బందోబస్తు నిర్వహించారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గరికిన సూకరాజు అనే కార్మికుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారని, అయితే అతనికి కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు యాజమాన్యం నిరాకరించిందన్నారు. కార్మికులంటే యాజమాన్యానికి చిన్న చూపు తగదన్నారు. వెంటనే యాజమాన్యం తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### సీఐ జీడీ బాబుకు సత్కారం


సీఐ బాబును సత్కరిస్తున్న డీసీపీ ఆనంద్‌రెడ్డి, పత్నిరావు

మల్కాపురం: కొద్ది నెలలు పని చేసినా శాంతి భద్రతల పరిరక్షణలో సీఐ జీడీ బాబు తన ముద్ర వేశారని పలువురు నాయకులు కొనియాడారు. మల్కాపురం సీఐ జీడీబాబుకు సాలూరు బదిలీ అయిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాలులో సత్కరించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీపీ ఆనంద్‌రెడ్డి, కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శరగడం పత్నిరావు,భీశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండరులో పాల్గొనాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో పొరుగు సేవల ద్వారా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గత నెల 26 నుంచి విధులకు గైర్హాజరవుతున్నందున గృహ, గృహేతరాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థపదార్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు అద్దె ప్రాతిపదికన టాటా వెహికల్స్ సమకూర్చేందుకు స్వల్ప వ్యవధితో కూడిన ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ జారీ చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కమిషనర్ పేర్కొన్నారు.

### రైతుల పక్షపాతి ఆడారి


స్వర్గీయ తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబూరావు

సింధియా: ఉత్తరాంధ్ర పాల విప్లవ పితామహుడు, రైతుల సంక్షేమ సారథి స్వర్గీయ ఆడారి తులసీరావు అని గుడాల బాబూరావు కొనియాడారు. తులసీరావు వర్ధంతిని పురస్కరించుకుని 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు తులసీరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పెద్దాడ ప్రసాదరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్ : స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడుతో 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి అవగాహనతో కూడిన శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ–మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు శత శాతం రుణాలు అందించేందుకు బ్యాంకులకు అనుసంధానం చేసి, అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అనకాపల్లి నుంచి సరోజిని, శ్రీకాకుళం నుంచి ఎం. కిరణ్‌కుమార్, విజయనగరం నుంచి బి. సుధాకరరావు, ఎస్‌ఎంసీలు ఆదినారాయణ, ఎన్. శ్రీనివాసరావు, రంగాచారి, లక్ష్మీనారాయణతో పాటు 4 జిల్లాల నుంచి డీఎంసీలు, సీవోలు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'


క్రీడాకారులను అభినందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. షిప్‌యార్డ్‌కాలనీలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ లీగ్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఆటల పోటీలకు అనూహ్య స్పందన లభించిందన్నారు. యువత క్రీడల్లో రాణించి దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు.

## పేద ప్రజలకు వరం వైఎస్సార్ బీమా


మృతురాలి కుటుంబ సభ్యలకు నగదు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: వైఎస్సార్ బీమా పథకం పేద ప్రజలకు వరం లాంటిదని 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు అన్నారు. దుర్గానగర్–4 సచివాలయ పరిధిలోని ప్రకాషనగర్‌కు చెందిన ఆళ్ల అరుణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమె వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావుతో కలిసి తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు అందజేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ మిగిలిన నగదు మృతురాలి నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల్లో రేషన్ పంపిణీ

విశాఖ విద్య: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీ నగర్ ఎఫ్ –బ్లాక్ అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన బాలింతలు, గర్భిణులకు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి వెంకటలక్ష్మి, వార్డు వలంటీర్ సత్యవతి రేషన్ అందజేశారు.